128
ధారావాహిక



# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** కాకతీయ రాజప్రాసాదం. ఆనాడు తన మందిరంలోనే ఉన్నాడు జాయచోడుడు. దాదాపు అర్ధరాత్రి కావస్తోంది. తల్పంపై అటూ ఇటూ దొర్లుతున్నాడు కానీ నిద్రపట్టడం లేదు. లోలోన ఏదో తెలియని ఇబ్బంది. యుద్ధవార్తలు భయపెడుతున్నాయి. రుద్రమ ఓటమితో పెనుగులాడుతున్నట్లు. అప్పుడే ద్వారపాలకుడు ద్వారం తట్టాడు. ఎవరో పెద్దామె వచ్చినట్లు విన్నవించాడు.

'పెద్దామె..??' దుప్పటి విసిరేసి చివ్వున లేచి బయటకు వచ్చాడు జాయచోడుడు. ఎదురుగా బాలాంబ అత్తమ్మ! సుబుద్ధి మామ రెండవ భార్య!! ఆ వృద్ధురాలు మూర్తీభవించిన దైన్యంగా నిలబడి బేలగా చూస్తోంది.

ఎక్కడో బలింజవాడలో ఉండే అత్తమ్మ.. పేటలు, వాడలు దాటి.. అర్ధరాత్రి ఒంటరిగా.. తన పురనివాసానికి వెళ్లి, అక్కడ లేడని తెలుసుకుని.. రాజప్రాసాదానికి.. తన మందిరం వరకూ రావడం.. ఏమాత్రం ఊహించని సంగతి. గత మాసమే మామను అత్తమ్మను పల్లకి పంపి పిలిపించుకున్నాడు. ముచ్చట్లు పంచుకుని మురిసిపోయాడు. ఇంతలో ఏమైంది?!

వేగంగా వెళ్లి గట్టిగా హత్తుకుని తన కడుపున పుట్టిన పసిపిల్లలా పొదవుకున్నాడు.

''అత్తమా.. ఏమైంది..''

''జాయ తండ్రీ! మీ మామ వద్దన్నా వినకుండా యుద్ధానికి వెళ్లారు. యుద్ధం గెలిచే పరిస్థితి లేదని ఇక్కడ చెప్పుకొంటున్నారు. నాకు రెండు రోజులుగా పీడకలలు. నువ్వు యుద్ధంలో ఉంటే నాకు ధైర్యం. కానీ, నువ్వు యుద్ధాలకు వెళ్లకుండా ఏదో రాసుకుంటున్నట్లు మొన్న వచ్చినప్పుడు చెప్పావు..'' ఏడుస్తూ చెప్పింది.

జాయచోడుని పట్టునుండి జారిపోయి మోకాళ్లపై కూర్చుండి చేతులు జోడించింది.

''నాకేదో భయంగా.. పీడకలలు! జాయ తండ్రీ మామను నాకు.. నా భర్తను నాకు.. తెచ్చిపెట్టు జాయా..''

గుండెలు పగిలేలా కుమిలికుమిలి ఏడుస్తోంది.

జాయచోడుడు నిర్ఘాంతపోయాడు. తనకు చెప్పకుండా ఈ వయసులో యుద్ధానికి ఎందుకు వెళ్లినట్లు..

యుద్ధమంటే రెచ్చిపోయే కాకతీయయోధుల్లో సుబుద్ధి ఒకడని ఆయనకు తెలుసు. కానీ, ఈ యుద్ధానికి ఆయన వెళ్తాడని ఏమాత్రం ఊహించలేదు.

''అత్తమా! నేను ఇప్పుడే యుద్ధ క్షేత్రానికి వెళ్తాను. మామను క్షేమంగా ఇల్లు చేర్చే బాధ్యత నాది. సరేనా..''

ఆమె చేతులు పైకెత్తి జోడించి నమస్కరించింది.

''ఎవరక్కడ.. ఈమెను పల్లకిలో క్షేమంగా ఇంటివద్దకు చేర్చండి..''

బట్టలు మార్చుకున్నాడు వడివడిగా. ఆయుధాలు ఒంటికి అమర్చుకున్నాడు. బయటకు పరిగెత్తాడు.

''విక్రమా.. సమయం లేదు. నువ్వే నన్ను యుద్ధ క్షేత్రానికి చేర్చాలి..'' వికటాట్టహాసం చేసింది విక్రమ. ఎక్కడ ఆగాడో ఎక్కడ తిన్నాడో ఏ సత్రంలో నిద్రపోయాడో.. పది రోజులకు ముత్తుకూరు యుద్ధక్షేత్రానికి.. కాకతీయ స్కంధావారానికి చేరాడు.

అప్పటికి అర్ధరాత్రి అవుతోంది.

స్కంధావారం విషాదంగా కనిపిస్తోంది. ఓడిపోయే యుద్ధ స్థితిని చెబుతోంది. విక్రమను నడిపిస్తూ మెల్లగా అటూఇటూ చూస్తూ పోతున్నాడు. రుద్రమదేవి గొల్లెన కాబోలు.. దీపాలు వెలుగుతున్నాయి. మనుషుల అలికిడి తెలుస్తోంది. యుద్ధం సంగతి ఏమిటో తనకు ఇప్పుడు అనవసరం. సుబుద్ధి మామ ఎక్కడ ఉంటాడు?! సేనాపతి స్థాయి వాళ్ల గొల్లెనలు వెతుకుతూ పోతున్నాడు. అప్పుడు వినిపించింది.

''ఎవరు.. ఎవరది?'' యుద్ధ వేగు అనుకుంటా..

''ఆ.. ఆ.. నేనే! జాయ చమూపతిని''

అంతే.. పక్క గొల్లెననుండి నలుగురైదుగురు సేనానులు బయటకు వచ్చేశారు.

''మహావీరా.. మీరు వచ్చారా!? దండాలు సామీ దండాలు.. ఇక మాకు కొత్త శక్తి వచ్చినట్లే..''

అవేవీ వినకుండా..